హత్యకేసులో ముద్దాయి అరెస్టు

దుర్గా ప్రశాంతి హత్యకేసు వివరాలను తెలియజేస్తున్న చిత్తూరు డీఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈ నెల 18వ తేదీన కొండమిట్టలో బ్యూటీ పార్లర్‌లో దుర్గా ప్రశాంతిని హత్యచేసి, ఆత్మహత్య ప్రయత్నం చేసిన చక్రవర్తిని తిరుపతి రుయా ఆసుపత్రి దగ్గర దిశ డిఎస్‌పి బాబుప్రసాద్ అరెస్టు చేశారు. చిత్తూరు కొండమిట్టలో గ్లోబ్యూటీ పార్లర్ నడుపుతున్న దుర్గాప్రశాంతికి గత సంవత్సరం అక్టోబర్‌లో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా దుబాయిలో ఉండే చక్రవర్తి అనే వంట మాస్టర్ పరిచయమయ్యారు. అప్పటినుంచి అతను దుర్గాప్రశాంతితో చాటింగ్ చేస్తూ ఉండడంతో ఇద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. ప్రశాంతి అంటే ఇష్టం పెంచుకున్న చక్రవర్తి తనని పెళ్లి చేసుకోమని అడిగాడు. చిత్తూరుకు వచ్చి ఇక్కడే ఉంటే, తన తల్లిదండ్రులతో ఒప్పించి పెళ్లి చేసుకోవచ్చని చెప్పింది. ఎలాగైనా ప్రశాంతిని పెళ్లి చేసుకోవాలనే నిర్ణయంతో ఫిబ్రవరి 6వ తేదీ చక్రవర్తి దుబాయ్ నుంచి నేరుగా చెన్నైలో దిగితే ప్రశాంతి చెన్నై వెళ్లి చక్రవర్తిని చిత్తూరుకు పిలుచుకొని వచ్చింది. చక్రవర్తి చిత్తూరులో ఒక చిన్న ఫాస్ట్‌పుడ్ సెంటర్‌ని పొన్నియమ్మ గుడిదగ్గర ప్రారంభించి, తన తల్లిని కూడా పిలిపించుకున్నాడు. చిత్తూరులో చక్రవర్తి తరచుగా ప్రశాంతిని కలుస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో ప్రశాంతి చక్రవర్తిని, అతని అమ్మని తన అమ్మ ఇందిరాకి కూడా పరిచయం చేసింది. అయితే ఈ మధ్యలో ప్రశాంతి తనని పట్టించుకోకుండా వేరే అబ్బాయితో సన్నిహితంగా ఉంటోందని, తనకి అబద్దం చెప్పి వేరే ఊరికి ఆ వ్యక్తితో వెళ్లిందనీ, ప్రశాంతి తన ఫోన్‌ని స్విచాఫ్ చేయడంతో చక్రవర్తికి అనుమానం పెరిగి ఆమె కదలికలపై నిఘా పెట్టాడు. 17.4.2023 రాత్రి ప్రశాంతి కోసం రైల్వే స్టేషన్లో కాపు కాశాడు. ఆమె ట్రైన్లో నుంచి దిగి ఇంటికి వెళ్ళాక రైల్వేస్టేషన్ దగ్గరే చక్రవర్తి ప్రశాంతి సన్నిహితంగా ఉంటున్న వ్యక్తితో గొడవ పడ్డాడు. ఇది తెలుసుకున్న ప్రశాంతి చక్రవర్తితో ఫోన్లో బాగా గొడవపడింది. చక్రవర్తి తను అనుకున్నట్టుగా సామాజిక స్థితి లేదని, అంతగా అనుమానించే వ్యక్తితో తను భవిష్యత్తులో ఉండలేనని ఇంట్లో వాళ్ళు కూడా రోడ్డు పైన ఆమ్లెట్లు వేసుకొనే వ్యక్తితో పెళ్లికి ఒప్పుకోరని, తన దారి తాను చూసుకోవచ్చనీ, ఫోన్లో తనతో ఉన్న చాటింగ్ అంతా తొలగించాలని ప్రశాంతి కచ్చితంగా చెప్పింది.

దీనితో చక్రవర్తి ప్రశాంతిపై పూర్తిగా ద్వేషం పెంచుకొని, బ్రతికితే కలిసే బ్రతకాలని లేకపోతే కలిసే చావాలని నిర్ణయం తీసుకున్నాడు. ప్రశాంతి నమ్మించి తనకు మోసం, ద్రోహం చేసిందనీ, తను బ్రతకాల్సిన అవసరం లేదని తన ఫోన్‌లో ఒక సూసైడ్ నోట్ రాసుకున్నాడు. 18.4.2023వ తేదీ మధ్యాహ్నం బ్యూటీ పార్లర్‌కి వెళ్లి ఒంటరిగా ఉన్న ప్రశాంతితో తన ప్రేమను ఎందుకు నిర్లక్ష్యం చేస్తోందనీ, తనకోసం అన్నీ వదులుకొని దుబాయ్ నుంచి వస్తే తనను పూర్తిగా పక్కన పెట్టేసిందని, తననే ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని గొడవ పడ్డాడు. ఇద్దరి మధ్య వాదన ముదిరి, చక్రవర్తి విచక్షణ కోల్పోయి ప్రశాంతిపై దాడిచేసి ఆమెను చంపాలని ఆమె గొంతు నులుముతూ, నువ్వు దక్కనప్పుడు నేనెందుకు బ్రతకాలి ఇద్దరం కలిసే చచ్చిపోదామని అని చెబుతూ అక్కడే ఉన్న సేవింగ్ బ్లేడ్ తీసుకొని తన చేతుల మీద, మణికట్టుల మీద కోసుకోవడం మొదలుపెట్టాడు. రక్తం ఒక్కసారిగా చిమ్మి తనమీద పడడంతో ప్రశాంతి ఊపిరాడక భయాందోళనతో కుప్పకూలిపోయింది. ఆమె చనిపోయిందని భావించి చక్రవర్తి తన గొంతు కూడా రెండు చోట్ల కోసుకొని రక్తస్రావంతో తను కూడా అపస్మారకస్థితిలో కూలిపోయాడు. 4గంటలప్పుడు రక్తపు మడుగులో వాళ్ళను చూసి ప్రశాంతి అమ్మ పోలీసులకు సమాచారం ఇచ్చింది. కొనప్రాణంతో ఉన్న చక్రవర్తిని, ప్రశాంతిని ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న 1 టౌన్ సిఐ నరసింహరాజు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఆసుపత్రిలో ప్రశాంతి అప్పటికే చనిపోయినట్టుగా తెలిపిన వైద్యులు, చక్రవర్తిని రూయా ఆసుపత్రికి తరలించారు. ప్రశాంతి తండ్రి హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు ఫిర్యాదు మేరకు చక్రవర్తిపై హత్య, ఆత్మహత్యయత్నం కేసు నమోదు చేయడం జరిగింది. చిత్తూరు జిల్లా వై.రిషాంత్ రెడ్డి, ఆదేశాల మేరకు ఈ కేసులో దిశ డిఎస్పీ జె.బాబుప్రసాద్ విచారణ చేపట్టారు. ముఖ్యమైన సాక్ష్యులను విచారించి ఆధారాలు సేకరించి, 26.4.2023వ తేది చక్రివర్తిని తిరుపతి రూయ ఆసుపత్రి వద్ద అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించారు. విలేకర్ల సమావేశంలో చిత్తూరు డిఎస్పీ కె.శ్రీనివాస మూర్తి, 1వ పట్టణ ఇన్స్పెక్టర్ నరసింహ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌరసేవల్లో జాప్యం చేసిన

ఉద్యోగులపై చర్యలు

అపరాధ రుసుం విధించిన కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో సిటిజన్ చార్ట్ అమలులో భాగంగా మున్సిపల్ సర్వీసులు, ప్రజాఫిర్యాదుల పరిష్కార విషయంలో నిర్ణీత సమయంలో (ఎస్ఎల్‌ఏ) పరిష్కరించని అధికారులపై నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ కఠినచర్యలు తీసుకున్నారు. పౌరసేవలు, ఫిర్యాదులను పరిష్కరించడంలో జాప్యం చేసిన అధికారులకు నిబంధనలు ప్రకారం అపరాధ రుసం విధిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ పరిధిలో పౌరసేవలు, ఫిర్యాదులను పరిష్కరించడానికి ప్రాధాన్యతను బట్టి నిర్ణీత సమయాన్ని (రోజులు) నిర్ణయించారు. నిర్ణీత సమయంలోపు పౌరసేవలు, ఫిర్యాదులను పరిష్కరించాలని కమిషనర్ ఇదివరకే పలుసార్లు హెచ్చరించారు. రోజువారి నిర్వహించే శాఖాపరమైన సమీక్ష సమావేశాల్లోనూ ఇదే అంశాన్ని స్పష్టం చేశారు. అయినా పలు విభాగాల్లో అధికారులు, ఉద్యోగుల తీరు మారకపోవడంతో గట్టిచర్యలకు ఉపక్రమించారు. కొళాయి కనెక్షన్లు, ట్రేడ్ లైసెన్సులు, ఆస్తిపన్నుకు సంబంధించిన పౌరసేవలు, ఫిర్యాదులను నిర్దేశించిన సమయంలో (ఎస్ఎల్ఏ గడువు లోపల) పరిష్కరించని అధికారులకు అపరాధ రుసుం విధిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. పౌరసేవలు, ఫిర్యాదుల పరిష్కారంలో ఒక్కరోజు జాప్యానికి రూ.100ల చొప్పున అపరాధ రుసుం విధించారు. నగరపాలక సంస్థ పరిధిలో ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం, రెవెన్యూ విభాగం సంబంధించి 14మంది అధికారులు, ఉద్యోగులు, ఇద్దరు అమినిటీ కార్యదర్శులు, నలుగురు పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులకు వారి సర్వీసుల సంఖ్య బట్టి అపరాధ రుసుం విధించారు. పౌరసేవలు అమలు విషయంలో నగరపాలక సంస్థ పరిధిలోని అధికారులు, ఉద్యోగులు ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా సకాలంలో పూర్తి చేయాలని కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

నియోజకవర్గానికి 75 ఆలయాలు

డిప్యూటీ సీఎం నారాయణస్వామి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి దేవాలయాల అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో కృషి చేస్తున్నారని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఎక్సైజ్‌శాఖ మంత్రి కె.నారాయణస్వామి పేర్కొన్నారు. గురువారం జీడీనెల్లూరు నియోజకవర్గ పరిధిలో పెనుమూరు మండల కేంద్రంలో ఉప ముఖ్యమంత్రి, టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డితో కలసి తిరుమల తిరుపతి దేవస్థానం వారి కళ్యాణ మండపంకు భూమిపూజ చేశారు. టిటిడి బోర్డు సభ్యులు పోకల అశోక్ కుమార్, రాష్ట్ర ఏపీఎస్ఆర్టీసీ వైస్‌చైర్మన్ విజయానందరెడ్డి, చిత్తూరు ఆర్డిఓ రేణుకా, ఆరు మండలాల జడ్పీటీసీలు, ఎంపిపిలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈసందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. టిటిడి సహకారంతో దేవాలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి కషి చేస్తున్నారని అన్నారు. గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ అభివద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని, ఈ నియోజకవర్గంలో రెండు 50పడకల ఆసుపత్రిని మంజూరు చేయడంతో పాటు కలిగిరి కొండ, వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధికి కృషి చేశారన్నారు. టిటిడి కళ్యాణ మండపం నిర్మాణంకు 20శాతం మ్యాచింగ్ గ్రాండ్ కట్టవలసి ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి పెద్దమనసుతో మ్యాచింగ్ గ్రాంట్ కట్టే పనిలేకుండా మంజూరు చేశారని, హిందూ ధర్మ ప్రచారంను టిటిడి యంత్రాంగం విస్తృతంగా చేస్తున్నదని, అందులో భాగంగా ఆలయాల నిర్మాణానికి పూర్తి సహకరిస్తున్నారన్నారని తెలిపారు. టిటిడి ఛైర్మన్ మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం నియోజకవర్గంలో అభివద్ధి బాగా జరుగుతోందని తెలిపారు. రెండు 50 పడకల ఆసుపత్రులు, డిగ్రీ కాలేజీ, మూడు ఇరిగేషన్ ప్రాజెక్టులను ముఖ్యమంత్రి మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. డిప్యూటీ సీఎం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలకనుగుణంగా పేదవారికి మంచి చేయాలనే ఉద్దేశంతో నిరంతరం పనిచేస్తున్నారని అభినందించారు. నియోజకవర్గంలో ఎకరా 12 సెంట్లలలో రూ.2కోట్లతో కళ్యాణ మండపం నిర్మాణంకు భూమిపూజ చేయడం సంతోషమని తెలిపారు. ఈకళ్యాణ మండపం నిర్మాణానికి ముందుగా 20 శాతం మ్యాచింగ్ గ్రాంట్ అనగా రూ.40లక్షలు చెల్లించాల్సి ఉండగా డిప్యూటీ సీఎం అభ్యర్థన మేరకు ముఖ్యమంత్రి అనుమతితో టీటీడీ బోర్డులో ఆమోదం తెలిపి కళ్యాణ మండపం మంజూరు చేయడం జరిగిందని, పేదలకు మంచి చేసే సదుద్దేశంతో డిప్యూటీ సీఎం చేసిన అభ్యర్థనను ముఖ్యమంత్రి ఆమోదించారని తెలిపారు. దళితులు, గిరిజనులు ఉన్న ప్రాంతాలలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయాలను నిర్మించేందుకు పెద్దఎత్తున కార్యక్రమం చేపట్టామని తద్వారా స్వామి వారి దర్శనభాగ్యం కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని, ఇందులో 1000 ఆలయాలు నిర్మాణం జరుగుతున్నదని దీనితో పాటు మరో 2000 ఆలయాలు మంజూరు చేయడం జరిగిందని, జీడి నెల్లూరు నియోజకవర్గానికి 75 ఆలయాలు మంజూరు చేశామన్నారు.



టీటీడీ కళ్యాణ మండపానికి శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం ,టిటిడి ఛైర్మన్

ఇంటర్ ఫలితాల్లో బాలికలదే హవా..

ప్రథమ సంవత్సరం టాపర్స్ / ద్వితీయ సంవత్సరం

ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు

ప్రజాశక్తి- సోమల: రాష్ట్రవ్యాప్తంగా విడుదలైన ఇంటర్ ఫలితాలలో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులలో బాలికల హవా కొనసాగింది. మొదటి సంవత్సరం 77మంది విద్యార్థులు పరీక్ష రాయగా 25 మంది ఉత్తీర్ణత సాధించి 32 శాతం ఫలితాలు వచ్చాయి. అదేవిధంగా ద్వితీయ సంవత్సరం 101 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 63 మంది ఉత్తీర్ణత సాధించి 62 శాతం ఫలితాలు వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర నాయుడు తెలిపారు. మొదటి సంవత్సరం ఫలితాలలో ఎంపిహెచ్‌డబ్ల్యు గ్రూప్‌లో పి.చందన 500 మార్కులకు 485 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచిందని తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపిహెచ్‌డబ్ల్యు గ్రూప్‌లో టి.చందన 500 మార్కులకు గాను 954 మార్కులు సాధించి కాలేజీ టాపర్‌గా నిలిచినట్లు ఆయన తెలిపారు. కాగా మొదటి, ద్వితీయ సంవత్సరం ఫలితాలలో అధిక శాతం బాలికలు ఉత్తీర్ణత సాధించి మంచి మార్కులు పొందారని బాలికల హవా కొనసాగిందని తెలియజేశారు.

ఇంటర్ ఫలితాల్లో 'విజ్ఞానసుధ' విజయభేరి

ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న వైస్ ఛైర్మన్ శ్రీధర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: బుధవారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు మొదటి ద్వితీయ సంవత్సర ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించారని కళాశాల వైస్ చైర్మన్ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. మొదటి సంవత్సరం ఎంఈసిలో లిఖిత 463, గిరీష్ 454, లోకేశ్వరి 443, ప్రీతి 415, లక్ష్మీనారాయణ 400, అఫ్రీన్ 398, తేనెమొలి 385 మార్కులు సాధించారని తెలిపారు. అలాగే ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో విజయలక్ష్మి 983, స్నేహ 950, లోహిత 930, దీపిక 925, చంద్రప్రియ 922, లోహిత 860, బైపీసీ విభాగంలో సలీం సదాఫ్ 966, నిషాబాబు 966, పూజ 956, నిత్యశ్రీ 921 మార్కులు సాధించారన్నారు. అలాగే ఎంఈసిలో సయ్యద్ నాజీరా 932 మార్కులు సాధించి తమ కళాశాల విద్యా బోధనకు తార్కారంగా నిలిచారని తెలిపారు. ఇంటర్ మొదటి ద్వితీయ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించేందుకు సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులను విజ్ఞాన సుధా జూనియర్ కళాశాల వైస్ చైర్మన్ శ్రీధర్ అభినందించారు.

రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన

'మదర్ థెరిసా' విద్యార్థులు

ప్రజాశక్తి- గంగవరం: ఇంటర్మీడియట్ పరీక్షఫలితాల్లో మదర్ తెరిసా రాష్ట్ర స్థాయి ఫలితాలు సాధించినట్లు కరస్పాండెంట్ రవీంద్రబాబు తెలియజేశారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూప్ చదువుతున్న భరత్ కుమార్ 1000 మార్కులు గాను 989 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మూడో స్థానం సాధించారని, అదేవిధంగా బైపిసి గ్రూప్ నుండి రేష్మ 987 ఎంపీసీ గ్రూప్ నుండి పవన్ కుమార్ 959 తాజు హర్షిత 948 మార్కులు సాధించారని తెలిపారు. 120 మంది విద్యార్థులు 900 మార్కులు సాధించారన్నారు. వీరితో పాటు మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూప్‌కి చెందిన మౌనిక 470 మార్కులు గాను 465 సాధించి రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించిందని, బైపిసి గ్రూప్ చెందిన రితిన్‌శ్రీ 429 ఎంఈసి గ్రూప్‌కు చెందిన రశ్మిత 483 చెందిన రంజిత 469 మార్కులు సాధించి కళాశాలకు పేరు ప్రఖ్యాతలు గడిచారని అధ్యాపకులను విద్యార్థులను కరస్పాండెంట్ రవీంద్రబాబు అభినందించినట్లు తెలిపారు.

విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ రవీంద్రబాబు

ఇంటర్ ఫలితాల్లో వాణి కళాశాల ప్రభంజనం

ప్రజాశక్తి- గంగవరం: మధు అండ్ వాణి కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాలలో ప్రభంజనం సృష్టించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బాలసుందరం రెడ్డి తెలియజేశారు. వీరిలో ఎంపీసీ గ్రూప్‌కి చెందిన హారతి 1000 మార్కులుగాను 989మార్కులు సాధించారని తెలిపారు. అలాగే బైపిసి గ్రూప్ చెందిన రక్షిత 980, నిహారిక 978, సీఈసీ గ్రూప్‌కి చెందిన సంజన 969, నందిని ప్రియ 953 మార్కులు సాధించారని తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాలలో ఎంపీసీ గ్రూప్‌కి చెందిన లక్ష్మీ ప్రియ 470 మార్కులు గాను 453, వర్షిత 459, మార్కులు బైపిసి గ్రూప్‌కి చెందిన సుల్తానా 422, అఫ్రీన్ 424 మార్కులు సాధించి కళాశాలకు పేరు ప్రఖ్యాతలు తెచ్చారని అన్నారు. ఉపాధ్యాయులను విద్యార్థులను అభినందించినట్లు తెలిపారు.

ఇంటర్‌లో సత్తాచాటిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు

ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు

ప్రజాశక్తి- నగరి: మండలంలోని డాక్టర్ ఎంఎస్ఎంఎన్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 109 మందికి 39 మంది, ద్వితీయ సంవత్సరంలో 120 మందికి 80మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎం.వెంకట రమణాచార్యులు గురువారం తెలిపారు. రెండో సంవత్సరంలో 1000 మార్కులకు గాను ఎంపీసీలో టి.సంధ్యకు 963, కె.రోజాకు 914 మార్కులు, బైపీసీలో డి.జ్ఞానపూర్ణిమ 962 మార్కులు, ఏఆర్.యాషిక 910, జ్యోతిర్మయి 909 మార్కులు, సీఈసీలో పి.గాయత్రి, స్వాతిలకు 898 మార్కులు, హెచ్ఈసీలో డి.కోకిల 864, జి.చంద్రిని 840 మార్కులు సాధించారని తెలిపారు.

పీసీఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

పీసీఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు ద్వితీయ సంవత్సరంలో 45 శాతం, మొదటి సంవత్సరంలో 40 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకు గాను ఎంపీసీలో హరిహరన్ 872 మార్కులు, గిరిబాబు 869 మార్కులు, బైపీసీలో రాజేష్ 811 మార్కులు సాధించగా, మొదటి సంవత్సరం ఎంపీసీలో రోహిత్ 380 (470) మార్కులు, బైపీసీలో ఉమామహేశ్వరి 425 (440) మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ వెంకటాచలపతి తెలిపారు.

ప్రతిభచాటిన 'సూర్య' విద్యార్థులు

ప్రజాశక్తి-నగరి: ఇంటర్ ఫలితాల్లో సూర్య జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కాలేజీ సెక్రటరీ జయరాం రాజు తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో బైపీసీలో 1000 మార్కులకు గాను ఎస్‌వి.జీవ 982 మార్కులు, ఆర్.రోజా 980, కెసి ప్రతిమ 979 మార్కులు సాధించగా ఎంపీసీలో కె.గుణశేఖర్ 989, ఎన్.కావ్య, పిఆర్ షర్మిల 987 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్‌లో ఎంపీసీలో ఎన్.జీవిత 463(470), జీబీ భానుప్రకాష్ 461(470), బైపీసీలో బి.పల్లవి 432 (440) మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు

చదువుల సరస్వతి

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలం తాడేపల్లి గ్రామానికి చెందిన సోము, కుమార్తె జీవన కుప్పం ఐఆర్ఎం ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ బైపిసి ద్వితీయ సంవత్సరం చదువుతుంది. బుధవారం విడుదలైన ఇంటర్ పరీక్షా ఫలితాల్లో 1000 మార్కులకు గాను 985 మార్కులు సంపాదించి చదువుల సరస్వతిగా నిలిచింది. ఉత్తమ మార్కులు సాధించిన జీవనను కళాశాల యాజమాన్యం అభినందించారు. తమ కూతురు మంచి మార్కులు సాధించడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

కళాశాల టాపర్ పి.అకీఫా

టాఫర్ అకీఫా

టాఫర్ అరుణ్

ప్రజాశక్తి- కార్వేటినగరం: ఇంటర్మీడియట్ ఫలితాల్లో కళాశాల టాపర్‌గా అకీఫా నిలిచిందని రాజా కుమారరాజా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాలసుబ్రమణ్యం రాజు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాల్లో పీ.అకీఫా (బైపీసీ) 440 మార్కులకు 397 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచినట్లు పేర్కొన్నారు. అలాగే పీ.లిఖిత (బైపీసీ) 440 మార్కులకు 274 మార్కులు సాధించి ద్వితీయస్థానంలో నిలిచిందన్నారు. ఎంపీసీలో పీ.కౌషిక్ 216 మార్కులు సాధించి తతీయస్థానంలో నిలిచారు. ద్వితీయ సంవత్సరంలో సి.అరుణ్ (ఎంపీసీ) 1000 మార్కులకు 832 మార్కులు సాధించి కళాశాలలో మొదటి స్థానంలో నిలిచారని, వి.సుప్రియ (ఎంపీసీ) 759. మేనక (బైపీసీ) 767, షర్మిల (బైపీసీ) 644 మార్కులు సాధించి ద్వితీయ, తతీయ స్థానాల్లో నిలిచారని పేర్కొన్నారు. కళాశాల మొదటి సంవత్సరం పరీక్షాఫలితాల్లో 17.05 శాతం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

సత్తాచాటిన భౌవిష్య

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలం ఆళ్లమడుగు గ్రామపంచాయతీ బుచ్చిరెడ్డి కండ్రిగ గ్రామానికి చెందిన కామసాని దామోదరరెడ్డి, కామసాని అనసూయ దంపతుల కుమార్తె కామసాని దీక్షిత విజయవాడలోని భౌవిష్య కాలేజీలో ఇంటర్మీడియట్ బైపీసీ చదివింది. బుధవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో 1000 మార్కులకు 955 మార్కులు సాధించింది. ఆమె మంచి మార్కులు సాధించడం పట్ల గురువారం పలువురు అభినందనలు తెలిపారు.

బోర్డు నాటారు.. హద్దులు మరిచారు..!

సమస్యకు పరిష్కారం చూపని రెవెన్యూశాఖ

మంత్రి ఆదేశించినా జరగని పనులు

శ్మశాన వాటికలో ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డు (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని తిప్పినాయుడుపల్లె గ్రామంలో స్మశాన వాటికలో బోర్డు నాటారు.. కానీ సర్వేసెన్ హద్దులు నిర్ణయించడం మరిచారు. మండలంలోని తిప్పినాయుడుపల్లె గ్రామంలో 163/1లో 1 ఎకరా 84 సెంట్లు గ్రామానికి సంబంధించి శ్మశానవాటిక స్థలం ఉంది. గతంలో స్థానికంగా ఉన్నవారు ఈ శ్మశానవాటిక స్థలాన్ని ఆక్రమించుకున్నారు. అప్పుడు గ్రామస్తులు అందరూ కలిసి తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన రెవెన్యూ వారు అక్కడ బోర్డును ఏర్పాటు చేసి ఎవరు ప్రవేశించరాదని తెలియజేశారు. కొన్ని కారణాలవల్ల శ్మశానవాటిక సర్వేచేసి హద్దులు వేయలేదు. అప్పటినుంచి గ్రామస్తుల సహకారంతో సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ భాస్కర్ ఈ స్థలంపై న్యాయ పోరాటం చేస్తూ తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అయినా ఇంతవరకు ఎలాంటి స్పందన లేదు అని వారు చెబుతున్నారు. స్వయంగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఏ రెవెన్యూ వారికి ఈ స్మశాన వాటిక సమస్యను పరిష్కారం చూపాలని చెప్పినప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలోని శ్మశాన వాటికలో ఉన్న సమస్యను పరిష్కరించి హద్దులు చూపాలని కోరుతున్నారు.

వారంలోపు సమస్యను పరిష్కరిస్తాం..

- పుల్లారెడ్డి తహశీల్దార్, వెదురుకుప్పం మండలం.

ప్రస్తుతం సర్వేర్లు, సిబ్బంది భూమి రీసర్వే కోసం గంగాధర నెల్లూరుకు వెళ్లారు. సిబ్బంది కొరతగా ఉంది. ఈ వారం లోపు శ్మశాన వాటిక సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తాం.

గ్రామ స్వరాజ్య పాలనకు సచివాలయ వ్యవస్థ

ఎమ్మెల్యే వెంకటే గౌడ

ప్రజాశక్తి-పెద్దపంజాణి: గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వ సేవలను ప్రజల వద్దకే తీసుకెళ్లాలని ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే వెంకటే గౌడ అన్నారు. గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అమ్మరాజుపల్లి, బొమ్మరాజుపల్లి, పంచాయతీలలో ఉమ్మడిగా నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ ప్రారంభించారు. అనంతరం మండలంలోని అమ్మరాజుపల్లి సచివాలయ పరిధిలోని అమ్మరాజుపల్లి, వడ్డూరు (కురప్పల్లి), ఎగువ బందార్లపల్లి,దిగువ బందార్లపల్లి గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మీ గడప వద్దకే మీ ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించి 465 గడపలను సందర్శించి ప్రభుత్వ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అమ్మరాజుపల్లి గ్రామంలోని పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి పావని గౌడ పాల్గొన్నారు. పలమనేరు నుంచి అప్పినపల్లికి వెళ్లే ఆర్టీసీ బస్సు అమ్మరాజుపల్లి గ్రామంలోకి వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు ఎమ్మెల్యేని కోరగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డప్ప, ఎంపీడీవో తూతీక శ్రీనివాస్ విశ్వనాథ్, తహసిల్దార్ హనుమంతు, జడ్పిటిసి సుష్మా కీర్తి, మండల వైసిపి కన్వీనర్ జి.బాగా రెడ్డి, వైస్ ఎంపీపీ జీడి బాబు, సర్పంచ్ స్వర్ణమ్మ, ఎంపీటీసీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పంచాయతీలో డిప్యూటీ సీఎం పర్యటన

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: మండలంలోని అంబోధరపల్లె పంచాయతీలో గురువారం, శుక్రవారం డిప్యూటీ సీఎం నారాయణస్వామి పర్యటించనున్నట్లు ఎంపీడీవో శ్రీదేవి, మండల రైతు భరోసా కేంద్రం యూనియన్ చైర్మన్ బలరామిరెడ్డిలు తెలిపారు. శుక్రవారం ఉదయం మొదటగా ఎల్ఎన్.కండిగ గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలను డిప్యూటీ సీఎం నారాయణస్వామి ప్రారంభించనున్నారని చెప్పారు. అనంతరం డిప్యూటీ సీఎం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

జడ్పీ సీఈవో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: స్థానిక ఎంపిడిఓ కార్యాలయాన్ని జెడ్పి సీఈవో ప్రభాకర్ రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను, రిజిస్టర్లను, సెక్షన్ గదులను పరిశీలించారు. అనంతరం అధికారులు సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులు, గృహ నిర్మాణాలు, పారిశుధ్యపనులు, తాగునీటి సమస్యలు, ఆఫీసు పరిసరాల పరిశుభ్ర గురించి చర్చించారు. స్పందన గ్రీవెన్స్‌లో వచ్చే సమస్యలను త్వరితగతిన పరిష్కరించానలి, సిఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో బిల్లులు అప్లో చేయడంపై పలు సూచనలు ఇచ్చారు. అలాగే గ్రామసచివాలయం అటెండన్స్‌ను పరిశీలించారు. ఇన్‌ఛార్జి ఎంపిడిఓ రాజేంద్ర బాలాజీ, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపిడిఓ కార్యాలయం పరిసరాలను పరిశీలిస్తున్న జెడ్పి సీఈఓ

డైట్ ప్రిన్సిపల్‌గా డాక్టర్ శేఖర్

ప్రజాశక్తి- కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం తిరుపతి జిల్లా ఇన్చార్జి డీఈవోగా ఉంటున్న డాక్టర్ శేఖర్ జిల్లాఅధికారుల ఆదేశాల మేరకు రెగ్యులర్ డైట్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టడం జరిగింది. గతంలో డైట్ సీనియర్ అధ్యాపకులుగా ఉంటున్న ప్రభాకర్ ఇన్‌ఛార్జీ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించే వారు. ఈ క్రమంలో భాగంగా ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ శేఖర్‌ను జిల్లా కామన్ పరీక్షావిభాగం (డీసీఈబీ) కార్యదర్శి కే.హేమారెడ్డి శాలువ కప్పి పుష్పగుచ్చాన్ని అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యాబోధనలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సమూల మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు విద్యబోధనలు చేపట్టాలని, ప్రతిసిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.

భూములు కోల్పోయిన

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు- తచ్చూరు నేషనల్ హైవేలో భూములు కోల్పోయిన రైతులకు ఇవ్వాల్సిన నష్టపరిహారం ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు మీనవేషాలు లెక్కించడం సరైనది కాదని వెంటనే రైతులకు నష్టపరహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు తచ్చూరు నేషనల్ హైవే పరిధిలో జిల్లాలో 8 మండలాలు భూములు సేకరణ చేశారని, అయితే 2013 భూసేకరణ చట్ట ప్రకారం రైతులకు నష్టపరహారం చెల్లించడంలో అధికారుల నిర్లక్ష్యం వహించారని అన్నారు. కొంతమందికి అరకొర చెల్లించినప్పటికీ ఇంకా అనేకమందికి నష్టపరిహారం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. రైతులు ఆఫీసులు చుట్టూ తిరుగుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకున్న పరిస్థితి లేదని, ఇక్కడికి అక్కడికి వెళ్ళండి అని తిప్పించుకుంటున్నారు తప్ప రైతులకు నష్టపరిహారం మాత్రం రావడం లేదన్నారు. ఈ హైఎ కి సంబంధించి సమాచారం కోసం నేషనల్ హైవే ఆఫీసులో అడిగిన అక్కడ ఉన్న సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బిఎన్.రెడ్డి కాలనీలో ఉన్న ఆఫీస్‌లో మాత్రం అధికారులు ఎప్పుడూ అందుబాటులో ఉండరని, ఆర్డీవో చెప్పిన సమాచారం ఇవ్వకుండా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని ఉన్నతాధికారులు సమావేశాలు పెట్టిన సందర్భంగా చెప్పున్న తర్వాత పట్టించుకున్న పరిస్థితి లేదని ఆరోపించారు. ఇప్పటికైనా నేషనల్ హైవేలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని లేనిపక్షంలో రైతులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి

హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మనాభం

ప్రజాశక్తి- సోమల: మండలంలో జగనన్న లేఔట్లలో నిర్మాణాలు జరుగుతున్న గహాలను లబ్ధిదారులు వేగవంతంగా పూర్తిచేసే విధంగా హౌసింగ్ సిబ్బంది నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలని హౌసింగ్ శాఖ పిడి పద్మనాభం కోరారు. గురువారం మండలంలోని మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామసమీపంలోని జగనన్న లేఅవుట్లో గహనిర్మాణాల తీరు లబ్ధిదారులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన కొలతల మేరకు లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టాలని బేస్మెంట్ నుండి గహనిర్మాణం పూర్తయ్యే వరకు వివిధ రకాల బిల్లులు ఎప్పటికప్పుడు మంజూరు చేస్తూఉన్నా ఎందుకు నిర్మాణాలు ఆలస్యమైతున్నాయో తెలపాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ భాషా మసూద్, మెకానిక్ భాష, సచివాలయ , హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మహాభారతం ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని మొరవ మహాభారతం ఉత్సవాలు ధ్వజారోహణ కార్యక్రమం గురువారం ప్రారంభమైనట్లు కార్యనిర్వాహకులు బోడిరెడ్డి తారక్‌రెడ్డి ఉభయదారులు తెలిపారు. మహాభారతం పరిధిలో ఉన్న గ్రామాలకు చెందిన భక్తులు ద్రౌపతి అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు పూజలు నిర్వహించారు. అనంతరం గర్భగుడి ధ్వజస్తంభానికి పూజలు నిర్వహించి మహాభారత ఉత్సవాలు ప్రారంభించారు. అదే రోజు నుంచి పగలు హరికథ, రాత్రి వీధి నాటకాలు ఉంటాయని ఆలయ ధర్మకర్తలు తెలిపారు.

ఎస్ఆర్ పురం: మహాభారతం శ్రీరంగరాజపురం మండలంలోని కొత్తపల్లి మహాభారతం గురువారం ధ్వజారోహణ కార్యక్రమంతో ప్రారంభమైంది. గురువారం నుంచి మే 14వ తేదీ ఆదివారం వరకు మహాభారత కార్యక్రమం నిర్వహిస్తారని ఆలయ ధర్మకర్త తెలిపారు. ధ్వజారోహణ కార్యక్రమానికి ఉభయదారులుగా కొత్తపల్లి కొత్తపల్లి మిట్టటకు చెందిన ఎం.రమేష్‌బాబు, సీఎం వెంకటేష్, సూరి, ఎం.సుధాకర్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

గుడిపల్లి నియోజకవర్గం

టీడీపీ సమన్వయ కన్వీనర్‌గా చంద్రశేఖర్

ప్రజాశక్తి- గుడిపల్లి: కుప్పం నియోజకవర్గం టిడిపి సమన్వయ కమిటీ కన్వీనర్‌గా గుడిపల్లి మండలం చెందిన మాజీ ఏఎంసీ ఛైర్మన్ ఆర్.చంద్రశేఖర్‌ను నియమిస్తూ రాష్ట్ర టిడిపి అధ్యక్షులు అచ్చెం నాయుడు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం పదవి అప్పజెప్పిన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, పార్టీ అధ్యక్షులు అచ్చం నాయుడుకి కతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో లక్ష మెజార్టీ లక్ష్యంగా అందర్నీ కలుపుకుంటూ పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా ఈ సమన్వయ కమిటీ సభ్యులుగా కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 31మందిని సభ్యులుగా నియమించడం జరిగిందన్నారు.

నియోజకవర్గ యూత్ అధ్యక్షులుగా వెంకటేష్

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలానికి చెందిన వెంకటేష్‌ను కుప్పం నియోజకవర్గ టిడిపి యువత అధ్యక్షులుగా నియమిస్తూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెం నాయుడు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంగా పదవిని అప్పజెప్పిన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, అచ్చెం నాయుడుకి, మండల నాయకులకు కతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా పార్టీ బలోపేతానికి నియోజకవర్గంలో అహర్నిశలు పనిచేస్తానని తెలిపారు.

స్మార్ట్ టీవీ పరిశ్రమను సందర్శించిన టీడీపీ చైర్మన్

ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం: రాష్ట్రంలోనే గ్రామీణ ప్రాంతంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న అతిపెద్ద స్మార్ట్ టీవీ పరిశ్రమ నిర్మాణపనులను గురువారం డిప్యూటీ సీఎం నారాయణస్వామి, టీటీడీ చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ... రాష్ట్రంలోనే అతిపెద్ద పరిశ్రమగా స్మార్ట్ టీవీ పరిశ్రమ నెలకొల్పడం జరిగిందని 6000 మంది ఉద్యోగ కల్పన ధ్యేయంగా పరిశ్రమ నిర్మిస్తున్నామని తెలిపారు. ఆగస్టు నెలలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించుటకు సన్నాహాలు చేస్తున్నారని అన్నారు. అదేవిధంగా రానున్న రోజుల్లో ఈ ప్రాంతానికి మరిన్ని పరిశ్రమలు తీసుకురావడానికి కషి చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో జడ్పిటిసి రమణ ప్రసాద్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ డివి డీల్లయ్య, కాపుసంఘ అధ్యక్షుడు విజయ్‌బాబు, కుప్పయ్య, జనార్ధన్, దేవరాజులు రెడ్డి, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫీలు కాదు సేవలు ముఖ్యం: మంత్రి ఆర్కేరోజా

జగనన్న కాలనీలో మంత్రి రోజా పర్యటన

ప్రజాశక్తి- నగరి: తమ ప్రభుత్వం పేదలకు ఇళ్లుకాదు ఏకంగా ఊళ్లే నిర్మించి ఇస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కతిక, యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని వారికి నాగరాజకుప్పం మార్గంలో నిర్మించి ఇస్తున్న జగనన్న కాలనీని ఆమె పరిశీలించారు. నిర్మాణాల పురోగతని, పూర్తి అవడానికి పట్టే సమయం తదితర అంశాలను అధికారులను, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. పనులు వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఆడపడుచుకు ఒక అన్న లాటా, తండ్రి లాగా జగనన్న ఆస్థిని అందజేస్తున్నారన్నారు. స్వంత ఇంటిలో నివాసమున్నామన్న గౌరవాన్ని పేదలకు ఆయన ఇస్తున్నారన్నారు. 1297 ఇళ్లు నాగరాజకుప్పంలోనే నిర్మిస్తున్నారన్నారు. సత్రవాడ, కాకవేడు, పుత్తూరు, వడమాలపేట అంటూ 7995ఇళ్లు ఒక్క నగరి నియోజకవర్గంలో ఉన్న పేద అక్కాచెల్లెమ్మలకు నిర్మించి ఇస్తున్నామన్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా పేదలు ఎందరికో లబ్దిచేకూరుతోందని అన్నారు. ఇది జనన్నకు వచ్చిన గొప్ప ఆలోచనన్నారు. గతంలో రేషన్ కార్డులు మంజూరు చేయడానికి కూడా వెనకాడిన ప్రభుత్వాలు నాయకులు నేడు సెల్ఫీ ఛాలెంజ్‌లు విసరడం విడ్డూరంగా ఉందన్నారు. సెల్ఫీలు కాదు సేవలు ముఖ్యం అని వారు తెలుసుకోవానల్సారు. నేడు ప్రభుత్వం చేపడుతున్నా అభివద్ధి పనులైన పాఠశాలలు, ఆస్పత్రులు నవీకరించడం, కొత్త మెడికల్ కాలేజీలు తెప్పించడం లాంటివి చిరస్థాయిగా నిలిచిపోయే అభివద్ధి పనులన్నారు. హౌసింగ్ ఈఈ శంకరప్ప, కౌన్సిలర్లు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరానికి అనూహ్య స్పందన

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలో ప్రత్యేక ఆధార్ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని మండల పరిషత్ అభివద్ధి అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. గురువారం మండలంలో ఇప్పటివరకు ఆధార్ నమోదుకాని 5 సంవత్సరాల లోపు చిన్నారులు ఉన్నారని గుర్తించిన ఎంపిడిఓ వారి కోసం ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరం స్థానిక అధికారులతో ఏర్పాటు చేయించారు. పెద్దపంజాణి గ్రామంలో ముస్లింలు అధికంగా ఉన్న భద్రాచలంగ్రామంలో అధిక శాతం చిన్నారుల ఆధార్ నమోదు కాలేదని గుర్తించారు. పంచాయతీరాజ్, వైద్య, మాత శిశు సంక్షేమ శాఖలను సమన్వయం చేసి పెద్దపంజాణి గ్రామ పంచాయతీ పరిధిలో 3 ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేయించి, చిన్నారుల వివరాలు ఆధార్‌పోర్టల్‌లో నిక్షిప్తం చేయించారు. ఆధార్ నమోదు జరుగుతుందని గ్రామంలో సచివాలయం సిబ్బందితో ముందస్తు సమాచారం ఇవ్వడంతో తల్లిదండ్రులు తమ పిల్లలతో ప్రత్యేక ఆధార్ శిబిరాల వద్ద బారులు తీరారు. పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం మజ్జిగ, తాగునీరు, శీతలపానియాలు వారికి అందించారు. ఆధార్ నమోదు ప్రక్రియ సాయంత్రం 5 గంటలకి రికార్డు స్థాయిలో 145 మంది చిన్నారుల వివరాలు ఆధార్‌అప్డేట్ చేశారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్లు అఖిల, ఐసిడిఎస్ సూపర్వైజర్లు హరిత, సుజాత, రాధమ్మ, అంగన్వాడీ వర్కర్లు ఇందిరా పాల్గొన్నారు.

జిల్లాలో మొదటిసారి ప్రత్యేక ఆధార్ నమోదు

ఇప్పటివరకు ఆధార్ నమోదు చేసుకొని ఐదు సంవత్సరాలలోపు పిల్లలు చాలామంది ఉన్నారని గుర్తించిన ఎంపీడీవో తూతీక శ్రీనివాస్ విశ్వనాథ్ ప్రత్యేక చొరవతో జిల్లాలోని మొదటిసారి మండల స్థాయిలో ప్రత్యేక ఆధార్ నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గురువారం 145 మంది పిల్లలకు ఆధార్ నమోదు చేసామని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడం పట్ల ఎంపీడీవో శ్రీనివాస్ విశ్వనాథను పలువురు ప్రసంగించారు.

ఘనంగా హార్వార్డ్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ భాస్కర్

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్: స్థానిక రామ్‌నగర్ కాలనీలోని హార్వార్డ్ స్కూల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల మూడవ వార్షికోత్సవ వేడుకలు గురువారం స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథులుగా నగర కమిషనర్ డాక్టర్ అరుణ, మాజీ పోలీసు ఉన్నతాధికారి కొండా వెంకటేశ్వరరావు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కరుణకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఉన్నత విలువలతో కూడిన విద్యను అందించడంతోపాటు విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పుతున్న హార్వార్డ్ స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. హార్వర్డ్ స్కూల్ ఏర్పాటుచేసిన అతితక్కువ కాలంలోనే విద్యార్థులకు అత్యున్నతమైన విలువలతో కూడిన విద్యను అందిస్తూ చక్కటి వాతావరణంలో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ఫార్వర్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ భాస్కర్, ఉపాధ్యాయ బందాన్ని అభినందించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లోని విజేతలను ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి.

బీఎంవీపల్లె పాఠశాలలో..

వెదురుకుప్పం: మండలంలోని బిఎంవి.పల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో ఈ ఏడాది వార్షికోత్సవం ప్రధానోపాధ్యాయులు బత్తల శంకర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. పిల్లల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ నీరుగట్టు సురేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ విధివిధానాల వల్ల ప్రాథమికోన్నత స్థాయి పిల్లలు స్థానిక ఉన్నత పాఠశాలల్లో చేరారని అయినప్పటికీ ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు ఇక్కడ సకల సదుపాయాలతో తరగతులను నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. పేరెంట్స్ కమిటీ మాజీ చైర్మన్ కొత్తపల్లి జాకబ్, డాక్టర్ బండి ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు పీతాంబరరెడ్డి, సరస్వతి, ధనుంజయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం

సోమల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం పాఠశాల వార్షికోత్సవ వేడుకలను ప్రధానోపాధ్యాయులు ఎల్లయ్య, ఉపాధ్యాయ బందం, విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సరస్వతీ పూజ అనంతరం తీర్థప్రసాద వినియోగం అనంతరం ఓం ఆకారాన్ని ఏర్పాటు చేసి చుట్టూ కొవ్వొత్తులను వెలిగించి అందంగా తీర్చిదిద్దారు. అలాగే పెద్ద ఉప్పరపల్లి ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. సరస్వతీపురం, పత్రపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో కూడా వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

మునెప్పనాయుడుకండ్రిగ పాఠశాలలో ...

నగరి: మండలంలోని మునెప్పనాయుడు కండ్రిగ ప్రాథమిక పాఠశాలలో గురువారం సరస్వతీపూజ, పాఠశాల వార్షికోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కలికిరి పవన్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయుల బోధనపై ఆసక్తి కలిగి అవగాహనతో విద్యాభ్యాసం చేసి ఉన్నతస్థాయికి చేరాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు విద్యా సంబంధిత పోటీలు, క్రీడాపోటీలు, నత్యపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల ప్రధానం చేశారు. విద్యార్థుల సాంస్కతిక కార్యక్రమాలు ఎంతో అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ద్రాక్షాయణి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ భువనేశ్వరి, మధ్యాహ్నభోజన పథక నిర్వాహకురాలు రోశి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కుక్కలదాడిలో దుప్పి మృతి

ప్రజాశక్తి- కార్వేటినగరం

కుక్కలదాడిలో దుప్పి మతిచెందిన సంఘటన మండల పరిధిలోని కేశవకుప్పం ఎస్టీకాలనీలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. అటవీశాఖ అధికారి చంద్రశేఖర్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అటవీ ప్రాంతం నుంచి తాగునీటి కోసం కేశవకుప్పం ఎస్టీకాలనీ వైపు రావడంతో గ్రామంలోని కుక్కలు దాడిచేసి గాయపరచడంతో దుప్పి మతి చెందిందని తెలిపారు. మతి చెందిన దుప్పిని కార్వేటినగరం సమీపంలోని కుప్పానగుంట నర్సరీ వద్ద పశువైద్యాధికారి డాక్టర్ హేమాద్రి పంచనామ నిర్వహించి అనంతరం ఖననం చేశారు. గత వారం క్రితం కూడా కేశవకుప్పం అటవీప్రాంతంలో కుక్కలదాడికి దుప్పి మతి చెందిందని అన్నారు. వారి వెంట ఆటవీశాఖ దిబ్బంది పలువురు ఉన్నారు.

వైభవంగా ఆలయ కుంభాభిషేకం

ప్రజాశక్తి-నగరి

మండలంలోని బుగ్గఅగ్రహారం గ్రామంలో బుగ్గ కాశీవిశ్వేశ్వరాలయ సమీపం గల బుగ్గశంకర మఠంలో శ్రీఆదిశంకర శ్రీ శంకర వినాయక ఆలయ కుంబాభిషేక వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామివారి ఆధ్వర్యంలో వేడకగా నిర్వమించిన కుంభాభిషేక వేడుకలకు భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయేంద్ర సరస్వతి భక్తులతో మాట్లాడుతూ 1932లో బుగ్గలో శంకరాచార్యుల వారు చాతుర్మాస్యను ఆచరించారన్నారు. దీంతో ఆలయ పరిసరాల్లో శ్రీశంకరమఠం స్థాపించబడిందన్నారు. 2006లో కుంభాభిషేకం నిర్వహించడం జరిగిందని ప్రస్తుతం ఆదిశంకర, శ్రీశంకర వినాయక దేవాలయాల జీర్ణోద్ధారణ అష్టబంధన మహాకుంభాభిషేక వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కుంభాభిషేక అనంతరం విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామి శంకరమఠం సమీపం గల అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు.

IN THE COURT OF THE PRL. DISTRICT JUDGE OF CHITTOOR
A.S.No. 89 of 2019
O.S.No.641 of 2014 on the file of Prl.Senior Civil Judge of Chittoor
Between :
1.S.Poorna Chandra Kumar
2. K.Venugopal
...Appellants
And:
1.K.Ethirajulu Naicker(died)
2.K.Srinivasulu,
3.K.Anasuya
... Respondents
NOTICE TO THE 3RD RESPONDENT
K.ANASUYA
To
K.ANASUYA D/o K.Ethirajulu Naicker, residing at D.No.6-57,Bhagyamma Street, Santhapeta, Chittoor Town and District.
Please take notice that the appeal filed by the appellants, stands posted to 11.05.2023 for your notice. If you fail to appear either in person or through an advocate on **11.05.2023 at 10.30 A.M** before the Prl. District Judge,Chittoor the matter will be decided exparte.
Sd/- G.RAJARAM
Advocate for Appellants

IN THE COURT OF THE I ADDL. JUNIOR CIVIL JUDGE OF CHITTOOR
O.S.No. 1008 of 2022
Between :
S.Haseena ...Plaintiff
And:
E.Santhi ...Defendant
NOTICE TO THE DEFENDANT
To
E.SANTHI
D/o E.Jayarama Naidu,
W/o Devendra,
D.No.4-8, Eguva Kandriga Village,
Diguvamasapalli Panchayati and Post,
Chittoor Mandal & District-517419
Madam,
Please take notice that the above case filed by the Plaintiff stands posted to **10.05.2023 at 10.30 A.M** for your apperance before the Hon'ble Court. If you fail to appear on that date either in person or through your counsel, the matter will be decided on merits in your absence.
Sd/- MOHAMMAD MUSTAFA
Advocate,Chittoor
Cell : 98858 45706